ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 01.07.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. 'వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' [VB-G RAM G] చట్టం, 2025 ఈరోజునుండి దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో అమల్లోకి వచ్చింది.
2. రైతు భరోసాను 10 వేల నుంచి 12 వేల రూపాయలకు పెంచి ఇప్పటి వరకు 27 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో వేశామని , ఈ దశలో మరో 9వేల కోట్ల రూపాయలు జమ చేయనున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.
3. రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూత ఇస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.
4. ఈరోజు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం పసుపురంగు హెచ్చరిక జారీచేసింది.

**విబిజీ రామ్ జీ**

'వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) ' [VB-G RAM G] చట్టం, 2025 ఈరోజునుండి భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో అమల్లోకి వచ్చింది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల వేతన ఉపాధికి హామీనిచ్చే ఈ చట్టం గ్రామీణ భారతదేశాన్ని శక్తివంతం చేస్తుందని గ్రామీణాభివృద్ధి శాఖ పేర్కొంది. దేశ వ్యాప్తంగా ఈ కొత్త విధానాన్ని అమలు చేయడానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 95వేల 692 కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలియజేసింది.

**ఎస్ఓఏ**

**రేవంత్**

రైతు భరోసాను 10 వేల నుంచి 12 వేల రూపాయలకు పెంచి ఇప్పటి వరకు 27 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో వేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. రాబోయే తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలను జమ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ విడతతో కలిసి 36 వేల కోట్ల రూపాయలు అవుతుందని నిన్న సాయంత్రం రైతుభరోసా నిధుల విడుదల సభలో అన్నారు. ఉచిత కరెంటు కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని , ఇప్పటి వరకు దీనికోసం 30 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని తెలియజేశారు.

**డెస్క్**

**వివేక్**

రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూత ఇస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. జైపూర్ మండలం గంగిపల్లిలో పర్యటించిన మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం మహిళా శక్తి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూత అందించి ప్రోత్సహిస్తుందని తెలిపారు.

**పీటీసీ - మంచిర్యాల**

**గవర్నర్**

ఏపీ మాస్ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా హైదరాబాద్ లోని డాక్టర్ ఎం.సి.ఆర్. హెచ్ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్ లో సమ్మిళిత వృద్ధికి సమాజ ఆధారిత మార్గాలపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా హాజరై ఈ సదస్సును ప్రారంభించారు.

**డెస్క్**

**రెడ్కో**

'మన ఊరు - మన బడి ' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల భవనాలపై రూఫ్‌టాప్ సౌరవిద్యుత్ ఏర్పాటుకు సంబంధించి టెండర్ల నిబంధనల్లో 'తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ

ఇంధన వనరుల సంస్థ (రెడ్కో)' మార్పులు చేసింది. గతంలో తొలిసారి ఈ పథకం కింద 1,500 పాఠశాలలపై 'సోలార్' ఏర్పాటు పనులకు పిలిచిన టెండర్లలో చిన్న కంపెనీలకు అవకాశమివ్వగా జాప్యం జరిగిందని... దీన్ని నివారించడానికి ఇప్పుడు పెద్దవాటికి ఇవ్వడానికి వీలుగా నిబంధనలను మార్చింది. ఈ మేరకు రాష్ట్రంలో కొత్తగా 9 వేల 937 పాఠశాలలపై 280 కోట్ల రూపాయలతో 46 మెగావాట్ల సామర్థ్యమున్న సౌరవిద్యుత్ ఫలకల బిగింపునకు రెడ్కో తాజాగా టెండర్లు పిలిచింది.

**డెస్క్**

**దరఖాస్తులు**

2026-27 విద్యా సంవత్సరానికి గాను 'అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి ' పథకం ద్వారా విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలనుకునే అర్హులైన ఎస్సీ విద్యార్థిని , విద్యార్థుల నుండి ఉపకార వేతనాల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అర్హత కలిగిన అభ్యర్థులు ఈరోజు నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

**పీఎస్**

**ఆదర్శం**

కేంద్ర ప్రభుత్వం సర్పంచ్ సంవద్ యాప్ ద్వారా గ్రామ సర్పంచ్ లకు ప్రతిభ ఆధారంగా ప్రకటిస్తోన్న మెరుగైన ర్యాంకులలో మే నెలకు గానూ.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని కోరటపల్లి గ్రామం ఆదర్శంగా నిలిచింది. ఆత్మనిర్భార్ మహిళా పంచాయతీ ఇతివృత్తంలో దేశంలోనే గ్రామ సర్పంచ్ మ్యాకల మహేశ్వరీకి మొదటి ర్యాంక్ దక్కింది. కోరటపల్లిలోని మహిళలు.. మహిళా సంఘాల ద్వారా రుణం పొంది కిరాణం , కుట్టు మిషన్, జ్యూట్ బాగ్స్ తయారీ, ఐకేపి కేంద్రాల నర్సరీ నిర్వహణ లాంటి పనులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేశ్వరి ఆకాశవాణితో మాట్లాడుతూ...

**బైట్ ... మ్యాకల మహేశ్వరీ**

**పీటీసీ - కరీంనగర్**

**పోలీస్ యాక్ట్**

శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఈరోజు నుంచి నెల రోజుల పాటు కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్-1861 అమలులో ఉంటుందని పోలీస్ సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర తెలిపారు. దీని ప్రకారం పోలీస్ అధికారుల అనుమతి లేకుండా ధర్నాలు , రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని... ప్రజా ధనానికి నష్టం కలిగించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.

**పీటీసీ - కామారెడ్డి**

**సభ్యుడు**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుడుగా డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 18 మంది సభ్యులతో నియమించిన ఈ కమిటీలో జనగామ నుండి డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ చోటు లభించింది.

**పీటీసీ - యాదాద్రి**

**వాతావరణం**

ఈరోజు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం పసుపురంగు హెచ్చరిక జారీచేసింది. కుమరం భీం ఆసిఫాబాద్ , మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల , సిద్దిపేట, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

**పిఎస్**

**జాతీయ వైద్యుల దినోత్సవం**

ఈరోజు దేశ వ్యాప్తంగా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. సమాజంలో ప్రాణదాతలుగా నిలిచే వైద్యుల సేవలను గుర్తించి , వారిని గౌరవించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. భారతదేశంలో ఈ దినోత్సవాన్ని 1991 నుండి అధికారికంగా పాటిస్తున్నారు. ప్రముఖ

వైద్యులు, స్వాతంత్ర్య సమరయోధులు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి అయిన డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జయంతి , వర్ధంతి సందర్భంగా ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. వైద్య రంగంలో ఆయన చేసిన విశేష సేవలకు గాను 1961లో దేశ అత్యున్నత పురస్కారం 'భారతరత్న'తో సత్కరించారు. రోగుల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమించే వైద్యుల మానసిక , శారీరక శ్రేయస్సును కాపాడవలసిన ఆవశ్యకతను ఈ ఇతివృత్తం నొక్కి చెబుతుంది.

**జీఎస్**

**వైద్య దినోత్సవం**

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ వైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులను సన్మానించగా , జిల్లా ఆస్పత్రిలో సూపర్డెంట్ ప్రవీణ్ ఆధ్వర్యంలో, మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షతన కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

**గంజాయి**

ఆసిఫాబాద్ జిల్లాలో గత రెండు సంవత్సరాల్లో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 296 కిలోలకు పైగా గంజాయిని దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ... జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్డీపీఎస్ చట్టంలోని నిబంధనలను అనుసరించి , పర్యావరణ కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పాటిస్తూ ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా దహనం చేసినట్లు తెలియజేశారు.

**పీటీసీ - ఆసిఫాబాద్**

**శాంతిభద్రతలు**

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారినీ ఉపేక్షించేది లేదని , చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు.

**పీటీసీ - నల్గొండ**

**శిక్షణ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నిరుద్యోగ ఎస్టీ యువతకు ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇస్తు న్నామని, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి సంగీత ఒక ప్రకటనలో తెలిపారు.

**పీటీసీ - సిరిసిల్ల**

**యూరియా**

పారదర్శకంగా యూరియాను పొందేందుకు వ్యవసాయశాఖ రూపొందించిన ప్రత్యేక యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ రైతులకు సూచించారు.

**పీటీసీ - ఖమ్మం**

**శిక్షణ**

మహబూబాబాద్ జిల్లాలో నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు టాస్క్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు టాస్క్ ప్రాంతీయ కార్యాలయ అధికారులు ప్రతిపాదిత భవనాలను పరిశీలించి , సెంటర్ ఏర్పాటుకు అనువైన భవనాన్ని ఎంపిక చేశారు.

**పీటీసీ - మహబూబాబాద్**

**రైతు భరోసా**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రైతుల బ్యాంకు ఖాతాల్లో 149 కోట్ల పైచిలుకు రైతు భరోసా డబ్బులు విడతల వారీగా జమ అవుతాయని , జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తెలిపారు.

**పీటీసీ - సిరిసిల్ల**

**బాబ్లీ**

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈరోజు మహారాష్ట్ర ప్రభుత్వం బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లను ఎత్తి నిర్మల్ జిల్లా శ్రీరాం సాగర్ ప్రాజెక్టు కు నీటిని విడుదల చేశారు. దీంతో శ్రీరాం సాగర్ ప్రాజెక్టు లోకి నీరు చేరనుంది.

**పీటీసీ - నిర్మల్**